క్లుప్తంగా

నేడు బాలభవన్‌లో ముగింపు వేడుకలు

గద్వాల: నెల రోజులుగా బాలభవన్‌లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరం ముగిసింది. ఈ సందర్భంగా శనివారం రాత్రి 7గంటలకు స్థానిక బాలభవన్‌లో ముగింపు వేడుకలు ఏర్పాటు చేశామని బాలభవన్ సూపరింటెండెంట్ శంకర్ తెలిపారు. వేసవి శిబిరంలో శిక్షణ పొందిన విద్యార్థులు నేర్చుకున్న సాంస్కృతిక కార్యక్రమాలను వేడుకల్లో ప్రదర్శిస్తారని చెప్పారు.

2న సిద్ది సాహెబ్ ఉర్సు



గద్వాలన్యూటౌన్: స్థానిక మార్కెట్ యార్డు రోడ్డు మార్గంలోని సిద్ది సాహెబ్ దర్గా ఉత్సవాలకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. దర్గా ప్రాంతాన్ని రకరకాల పుష్పాలు, విద్యుదీపాలతో అలంకరించారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం గంధం, 2వ తేదీ ఆదివారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు ఉర్సు నిర్వహించనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు అన్సర్, ఇతర సభ్యులు కోరారు.

ఇంట్లో చోరీ : కేసు నమోదు

గద్వాల క్రైం: తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడిన ఘటన శుక్రవారం పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణ ఎస్ఐ శ్రీనివాస్ వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం పట్టణంలోని మోమిన్ మహెల్లా కాలనీకి చెందిన జునేద్ కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి పట్టణంలోని బంధువుల వివాహ వేడుకలకు వెళ్లారు. ఈ క్రమంలో గుర్తు తెలియని దుండగులు ఇంట్లోకి చొరబడి రూ.60వేల నగదు, రూ.32వేల విలువైన సామగ్రిని ఎత్తుకెళ్లారు. అనంతరం ఇంటికెళ్లి చూడగా చోరీ చేసినట్లు గుర్తించి వెంటనే పట్టణ పోలీస్‌స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మట్టి టిప్పర్ పట్టివేత

శాంతినగర్: మట్టి తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకుని శాంతినగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తహసీల్దార్ శ్రీనివాస్ జ్యోషి తెలిపారు. జూలెకల్ శివారులో అనుమతి లేకుండా మట్టి తరలిస్తున్నారనే సమాచారం రావడంతో జూలెకల్ స్టేజీకి చేరుకున్న తహసీల్దార్ జ్యోషి, ఎస్ఐ సంతోష్‌లు టిప్పర్‌ను అడ్డుకున్నారు. ప్రభుత్వ అనుమతి పత్రాలు చూపాలని కోరగా ఉన్నాయని బుకాయించారు. దీంతో అనుమతి పత్రాలు చూయించి టిప్పర్‌ను తీసుకువెళ్లాలని సూచించినట్లు తహసీల్దార్ తెలిపారు.

'పంచాయతీ స్థలాన్ని కబ్జా కాకుండా చూడాలి'

అలంపూర్ రూరల్: మండల పరిధిలోని ర్యాలంపాడ్ గ్రామ పంచాయతీ స్థలం కబ్జాకు గురి కాకుండా చూడాలని అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్‌కు శుక్రవారం ర్యాలంపాడ్ గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఖాళీ స్థలాన్ని అక్రమంగా కబ్జా చేస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

శ్మశాన వాటికలో పనులు



శాంతినగర్: వడ్డేపల్లి పుర పరిధిలోని పైపాడులోని శ్మశాన వాటికలో జేసీబీతో ముళ్లపొదలు తొలగించే పనులను మున్సిపల్ సిబ్బంది చేపట్టారు. శానిటేషన్ స్పెషల్‌డ్రైవ్ కార్యక్రమంలో బాగంగా శ్మశాన వాటికను శుభ్రపరిచే పనులు చేపట్టినట్లు సిబ్బంది తెలిపారు.

విద్యార్థులకు విద్యాదీవెన పథకం

శాంతినగర్: అలంపూర్ నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన నాయీబ్రాహ్మణ విద్యార్థులకు విద్యాదీవెన పథకం ద్వారా బహుమతుల ప్రదానం చేయనున్నటు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, శాంతినగర్ పట్టణ అధ్యక్షుడు అశోక్‌కుమార్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శాంతినగర్‌లోని కన్యకాపరమేశ్వరి కల్యాణమండపంలో శనివారం మధ్యాహ్నం 1 గంటకు సమావేశం ఉంటుందన్నారు. ఆయా మండలాల నాయీబ్రాహ్మణ విద్యార్థులు పదో తరగతి, ఇంటర్‌లో ఎక్కువ మార్కులు సాధించిన వారికి బహుమతులు ఇస్తామని పేర్కొన్నారు. ఈ విషయమై అన్ని మండలాలకు చెందిన నాయీబ్రాహ్మణసంఘం అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు సమాచారం అందించాలన్నారు.

వ్యక్తి అదృశ్యం

కేటీదొడ్డి: వ్యక్తి అదృశ్యమైన సంఘటన మండలంలోని మల్లాపురంతండాలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్‌రావు కథనం మేరకు.. మల్లాపురంతండాకు చెందిన కృష్ణనాయక్ గురువారం ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. బంధువులు కుటుంబ సభ్యుల వద్ద వెతికినా ఆచూకీ తెలియలేదు. దీంతో భార్య మాణిక్యమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గడ్డి విత్తనాలకు మంగళమేనా?

- బహువార్షిక గడ్డి విత్తనాల సాగుతో పాడి రైతులకు లాభదాయకం
- పచ్చిమేత వేయడంతో పాల దిగుబడి, పశువులకు పోషకాహారం
- గతంలో 75 శాతం సబ్సిడీతో విత్తనాలు సరఫరా
- వేలకు వేలు వెచ్చించి పశుగ్రాసం కొనుగోళ్లు
- చర్యలు తీసుకోవాలని కోరుతున్న రైతులు



యాపదిన్నెలో కోత తర్వాత ఇగురు పెట్టిన బహువార్షిక గడ్డి

శాంతినగర్: బహువార్షిక గడ్డిసాగుతో అటు పశుపోషకులకు ఇటు పాడి పశువుల యజమానులకు ఎంతో లాభదాయకంగా ఉండేది. గతేడాది ఏర్పడిన తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల వానాకాలంలో విరివిగా లభించే పచ్చిమేవు లేక పశుపోషకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. వానాకాలంలో మొత్తం ఆరుబయట లభించే పచ్చిగడ్డితో పశువులను పోషించుకునేవారు. వేసవికాలంలో మేపు కోసం వరిగడ్డి, వేరుశనగ పొట్టు, జొన్న సొప్ప కల్లాల్లో నిల్వ ఉంచుకునేవారు. గతేడాది పశుగ్రాసం ఎండిపోవడంతో పశువులకు మేపు దొరకక కొందరు పశువులను అమ్ముకోగా, మరికొందరు సుదూర ప్రాంతాలకు వెళ్లి వేలకు వేలు వెచ్చించి వరిగడ్డి కొనుగోలు చేశారు. పశువులను కాపాడుకునే పరిస్థితులు అలంపూర్ నియోజకవర్గంలో కనిపించాయి. ఈ విషయమై పశుసంవర్ధకశాఖ అధికారులు స్పందించి బహువార్షిక పచ్చిగడ్డి ఎస్ఎస్‌జీ రకం విత్తనాలను వెంటనే అందుబాటులోకి తెచ్చి సబ్సిడీపై పంపిణీ చేసి రైతులను ఆదుకోవాలి.

మూడు నుంచి నాలుగు కోతలు

బహువార్షిక గడ్డి విత్తనాలు సాగుచేస్తే మూడు నుంచి నాలుగు కోతల వరకు పశుగ్రాసం లభిస్తుంది. గతంలో వర్షాలు బాగా కురియడంతో పచ్చిమేతకు ఇబ్బందులు కలిగేవికావు. గతేడాది వర్షాభావ పరిస్థితుల వల్ల పశుగ్రాసం కొరత ఏర్పడింది. దీంతో రైతులు బహువార్షిక గడ్డి విత్తనాల సాగుపై దృష్టి సారించారు. పొలాల్లో కొంతభాగం గడ్డి పెంపకానికి వదిలిపెట్టి మిగతా పొలంలో పంటలు సాగు చేసేందుకు సమాయత్తమయ్యారు. ఈ ఏడాది మొదట్లోనే గడ్డివిత్తనాలు తెచ్చుకుని సాగుచేసుకుందామని పశువైద్యశాలలకు రైతులు వెళ్తే గడ్డివిత్తనాలు రాలేదని పశువైద్యాధికారులు నిరాశకు గురవుతున్నారు.

75 శాతం సబ్సిడీతో..

కొన్నేళ్లుగా ఎస్ఎస్‌జీ రకం గడ్డివిత్తనాలను ఆయా మండలాల్లోని పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో 75 శాతం సబ్సిడీపై రైతులకు ప్రభుత్వం అందించేది. కేజీ ధర రూ.52 కాగా, 75 శాతం సబ్సిడీ రూ.39 పోను రూ.13 కే విత్తనాలు రైతులకు లభించేవి. ఈ ఏడాది ఇప్పటివరకు గడ్డి విత్తనాలు అందుబాటులోకి రాకపోవడంతో రైతులు, పాడిపశువుల యజమానులు ఆందోళనకు గురవుతున్నారు. పశువులకు మేపు ఎలా సమకూర్చుకోవాలోనని సతమతమవుతున్నారు. గతేడాది మండలానికి టన్ను చొప్పున విత్తనాలు రాగా ఈ ఏడాది విత్తనాల ఊసే లేదని రైతులు ఆవేదన వ్యక్తంచే స్తున్నారు.

వేలకు వేలు వెచ్చించి కొనుగోళ్లు

గతేడాది తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల పశువులకు మేపు లేక పశుగ్రాసం కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లి వేలకు వేలు వెచ్చించి కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు దాపురించాయి. బహువార్షిక గడ్డి విత్తనాలు అందుబాటులో ఉంటే వాటిని సాగుచేసి కొంతవరకైనా గడ్డి కొరతను అధిగమిస్తామని రైతులు అంటున్నారు. గతేడాది కృష్ణానది అవలివైపు గ్రామాలకు ట్రాక్టర్లతో వరిగడ్డి కొనుగోలుచేసి పశుసంపదను కాపాడుకోగలిగారు. ఈ ఏడాది అలాంటి పరిస్థితులు రాకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

గడ్డి సాగుతో కొరత తీరింది



ప్రభుత్వం సబ్సిడీపై అందజేసిన గడ్డి విత్తనాలను కొనుగోలు చేసి మా పొలంలో పెంచాను. గత రెండేళ్లుగా పచ్చిగడ్డి కొరత లేకుండా పశువులకు ప్రతి నిత్యం అందిస్తూ వస్తున్నాను. ఎద్దులకు మేపుగా, పాడిపశువులకు దాణాగా మిషిన్‌తో కట్‌చేసి వేస్తున్నాను, గడ్డి పెంపకంతో పాలదిగుబడి బాగా పెరిగింది. ఈ ఏడాది విత్తనాలు ఇస్తే కొత్త పొలంలో సాగుచేద్దామని చూస్తున్నాను. గతంలో సాగుచేసిన గడ్డి నాలుగు కోతలైంది. కొత్తగా విత్తనాలు ఇస్తే గడ్డి సాగుచేసుకుని పశుసంపదను కాపాడుకుంటాను.

– శ్రీనివాసరెడ్డి, రైతు, యాపదిన్నె

విత్తనాలు రాలేదని చెబుతున్నారు..



గతంలో గడ్డి పంట సాగుచేశాను. నాలుగు కోతలు అయిపోవడంతో వదిలేశాను. పచ్చిగడ్డి గేదెలకు ఆహారంగా బాగా ఉపయోగపడేది. గతేడాది గడ్డి సాగుచేయకపోవడంతో వర్షాలు లేక పచ్చిగడ్డి దొరక్క పశుగ్రాసం కోసం చాలా ఇబ్బంది పడ్డాను. పెద్దేటి అవతల నుంచి వేల రూపాయలు పెట్టి ట్రాక్టర్లతో వరిగడ్డి తెచ్చుకుని పశువులను కాపాడుకున్నాను. శాంతినగర్ కార్యాలయానికి వెళ్లి అడిగితే గడ్డి విత్తనాలు రాలేదని చెప్పారు. తొందరగా విత్తనాలు తెప్పించి రైతులకు అందజేస్తే బాగుంటుంది.

– రవిరెడ్డి, రైతు, కొంకల

ఈ ఏడాది రాలేదు..



కొన్నేళ్లుగా గడ్డి విత్తనాలను సబ్సిడీపై రైతులకు అందజేశాం. కేజీ రూ.13కు ఇవ్వడంతో చాలా మంది రైతులు కొనుగోలుచేసి సాగుచేశారు. ఉమ్మడి వడ్డేపల్లి, రాజోళి మండలాలకు సంబంధించి గతేడాది రెండు టన్నులు వచ్చాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు గడ్డి విత్తనాలు రాలేదు. వస్తే పంపిణీ చేస్తాం.

– డాక్టర్ పుష్పలత, పశువైద్యశాల, శాంతినగర్

విత్తనాలు ఎమ్మార్పీకే విక్రయించాలి



మాట్లాడుతున్న ఎంఏఓ రాధ

శాంతినగర్: రైతులు పొలాల్లో సాగుచేసే వివిధ రకాల విత్తనాలను ఎమ్మార్పీ ధరకే విక్రయించాలని, లేని పక్షంలో విత్తన చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామని వడ్డేపల్లి మండల ఎంఏఓ రాధ డీలర్లను హెచ్చరించారు. వడ్డేపల్లి మండల విత్తన డీలర్ల సమావేశం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయ ఆవరణలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఏఓ మాట్లాడుతూ ఎమ్మార్పీ ధరలకు విత్తనాలు విక్రయించడమేకాకుండా స్టాక్ బోర్డుపై ధరల పట్టికను రాసిపెట్టాలని, స్టాకు రిజిస్టర్‌లో అన్ని వివరాలు నమోదు చేయాలన్నారు. రైతులకు ఒరిజినల్ బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలని, ఇన్వాయిస్‌లు, పీసీలు డీలర్ల వద్ద తప్పనిసరిగా భద్రపరుచుకోవాలని సూచించారు. ఈనెల 25న మన గ్రోమోర్ సెంటర్‌లో తనిఖీ నిర్వహించగా 7067 పత్తిరకం విత్తనాలు స్టాకు ఉన్నప్పటికి రైతులకు లేవని చెప్పినందుకు వారికి నోటీసు ఇచ్చినట్లు ఎంఏఓ తెలిపారు. సమావేశంలో విత్తన దుకాణ డీలర్లు, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

చెక్కు అందజేత



గద్వాల క్రైం: జిల్లా సాయుధ బలగాల విభాగంలో ఏఆర్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న సురేష్‌బాబు కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ రితిరాజ్ బాధిత కుటుంబ సభ్యులకు రూ.8లక్షల చెక్కును అందజేశారు. వారి కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్‌లో పోలీస్‌శాఖ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పోక్సో బాధితురాలుకు తక్షణ సాయం నిధి ద్వారా రూ.10వేలు అందజేశారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని బాధితురాలికి ఎస్పీ సూచించారు.

పచ్చని చెట్లతో కనువిందు



ఆలూరు-రాయాపురం మధ్య రోడ్డుకు ఇరువైపులా ఉన్న పచ్చని చెట్లు

గట్టు: రోడ్డుకు ఇరువైపులా ఉన్న పచ్చని చెట్లు వాహనదారులకు కనువిందు చేస్తున్నాయి. మండే వేసవిలో మొక్కలకు నీరందక ఎండుపోయిన మొక్కలు కన్పించడం సర్వసాధారణం. ఇక్కడ మాత్రం అందుకు విరుద్ధంగా తారు రోడ్డుకు ఇరువైపులా పచ్చగా చిగురించిన ఆకులతో ఆహ్లాదకరంగా చల్లని గాలులను వీస్తూ, వాహన దారులను ఆకట్టుకుంటున్నాయి. ఆలూరు నుంచి రాయాపురం, రాయాపురం స్టేజీ వరకు తారు రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలు వేసవిలో పచ్చగా కనువిందు చేస్తున్నారు. ఆలూరు, రాయాపురం గ్రామాల మధ్య రోడ్డు గుండా ప్రయాణం చేస్తున్నప్పుడు శ్రీశైలం నల్లమల అడవుల్లో ప్రయాణిస్తున్న అనుభూతి కల్గుతుందని వాహనదారులు తెలిపారు. అయితే కొంత మంది ఈ చెట్లను నరికి వంట చెరుకుగా ఉపయోగిస్తున్నారు. మరి కొంత మంది చెత్తకు నిప్పు పెడుతుండడంతో చెట్లు దెబ్బతింటున్నట్లు వాహన దారులు తెలిపారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లకు నిరంతర పర్యవేక్షణ చేస్తూ, వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని వాహన దారులు కోరుతున్నారు.

జీవాలకు వ్యాధి నిరోధక టీకాలు

- వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం
- 3.50లక్షల పశువులకు వ్యాధి నిరోధక టీకాలు లక్ష్యం
- పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి



టీకాల కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న డాక్టర్ వెంకటేశ్వర్లు

గద్వాల వ్యవసాయం: వర్షాకాలం రానున్న నేపథ్యంలో పశువులు, గొర్రెలు, మేకలకు వివిధ రకాల వ్యాధులు ప్రబలుతుంటాయి. ఈ వ్యాధుల నివారణకు జిల్లా పశుసంవర్ధకశాఖ ముందస్తుగా చర్యలు చేపట్టింది. పశువుల్లో వచ్చే జబ్బవాపు, గొంతువాపు జీవాలకు సోకే వ్యాధుల నివారణకు ముందస్తుగా పశువైద్య సిబ్బంది ఉచితంగా టీకాలు వేస్తున్నారు. ఇందుకోసం మండలాల వారీగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఉచిత టీకాలు వేసే కార్యక్రమం జిల్లాలో ఈనెల 24వ తేదీ ప్రారంభించారు.

ఇప్పటికే ఓమోస్తరు వర్షాలు కురిశాయి. మరి కొద్ది రోజుల్లో వర్షాకాలం ఆరంభం కానుంది. వర్షాలకు నీటి వనరుల్లో కొత్తనీరు చేరడంతో పాటు, చెత్తచెదారం, జంతువుల కళేబరాలు చేరుతాయి. రకరకాల బ్యాక్టీరియా ఉత్పన్నం అవుతుంది. ఈ నీటిని తాగే పశువులు వ్యాధుల భారిన పడుతాయి. ప్రధానంగా గేదెలు గొంతువాపు, ఆవులు, ఎద్దులు, కొడెదూడలు జబ్బవాపు భారిన పడతాయి. ఇక తొలకరి వర్షాలకు మొలిచే పచ్చిగడ్డి తిని జీవాలు చిటుక రోగానికి గురి అవుతాయి. గొంతువాపు, జబ్బవాపు, చిటుక వ్యాధులు ప్రాణాంతకమైనవి.

ముందస్తు టీకాలు..

పశువులు గొంతువాపు, జబ్బవాపు జీవాలు చిటుక వ్యాధుల భారిన పడకుండా జిల్లా పశుసంవర్ధకశాఖ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. పశువులు, జీవాలకు ముందస్తుగా ఉచితంగా నివారణ టీకాలు పశువైద్య సిబ్బంది వేస్తున్నారు. గేదెల్లో గొంతువాపు రాకుండా బీక్యూ, ఆవులు, ఎద్దులు, కొడెదూడల్లో జబ్బవాపు రాకుండా హెచ్ఎస్, జీవాల్లో చిటుక వ్యాధి రాకుండా ఈటీ టీకాలను సిబ్బంది వేస్తున్నారు. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా బృందాలను ఏర్పాటు చేశారు. మే 23 నుంచి జిల్లాలో టీకాలు వేసే కార్యక్రమం ఆరంభమైంది. మరోవారం రోజుల్లో పూర్తి కానుంది. గొంతువాపు నివారణకు 44వేల గేదెలకు టీకాలు వేసే లక్ష్యం ఉండగా, 2930 గేదెలకు, జబ్బవాపు నివారణకు 30వేల ఆవులు, ఎద్దులు, కోడెదూడలు 2,161, చిటుక రోగ నివారణకు 3.50లక్షల జీవాలకు గాను 68,321 వాటికి ఇప్పటి వరకు టీకాలు వేసినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. పశువుల్లో, జీవాల్లో వ్యాధులు రాకుంగా వేస్తున్న వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని పాడిరైతులు, పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశువైద్య, పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు.

అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే



ఉండవెల్లి: మండలంలోని బొంకూరులో ఎంపీటీసీ విజయమ్మ భర్త గోపాల్‌రెడ్డి శుక్రవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడు అంతిమయాత్రలో పాల్గొన్నారు. బొంకూరులో గ్రామ పెద్దగా ఉంటూ అందరికి అండగా ఉంటున్న గోపాల్‌రెడ్డిని కోల్పోవడం బాధాకరమని పేర్కొన్నారు. అంతిమ యాత్రలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌కు సన్మానం

అయిజ: స్థానిక పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ శ్రీనివాస్ కేటీ దొడ్డి మండలానికి బదిలీ అయ్యారు. శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ విజయభాస్కర్ కానిస్టేబుల్ శ్రీనివాస్‌ను శాలువా, పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడారు. ఇంతకాలం కానిస్టేబుల్‌గా విధులు సక్రమంగా నిర్వహించినట్లు కొనియాడారు. ఎక్కడ ఉద్యోగం చేసినా మంచి పేరు తెచ్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

స్పందించిన అధికారులు



సాక్షి ఎఫెక్ట్..

మానవపాడు: మండల కేంద్రంలోని ప్రధాన 'రోడ్డుపై చెట్టుకొమ్మలు' అనే శీర్షికతో సోమవారం 'సాక్షి' పత్రికలో ప్రచురితమైంది. స్పందించిన అధికారులు శుక్రవారం రోడ్డుపై చెట్టు కొమ్మలను తొలగించారు. ఈ సందర్భంగా ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

మానవపాడు: రోడ్డు నిబంధనలు పాటిచాలని ఎస్ చంద్రకాంత్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని పలు వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మద్యం తాగి వాహనాలు నడుపరాదని, రోడ్డు పరిమితికి మించి వాహనాల్లో ప్రజలను తరలించరాదని సూచించారు. త్రిబుల్ రైడింగ్ చేయరాదన్నారు. తనిఖీలో పోలీస్‌లు ఉన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తకు పరామర్శ

మానవపాడు: మండలంలోని కలుకుంట్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి బ్రెయిన్ సర్జరీ సీరియస్ ఉన్నందున శుక్రవారం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ పరామర్శించారు. వైద్యులకు నాణ్యమైన వైద్యం అందించాలని ఆదేశించారు. ఆయన వెంట పైపాడ్ రామ్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి, రుక్మానందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



విత్తన దుకాణం పరిశీలిస్తున్న అధికారులు

అయిజ: రైతులకు విత్తనాలు విక్రయించే దుకాణాల యజమానులు ప్రభుత్వం విధించిన నిబంధనలు పాటించాలని, పాటించని వారిపై చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని అలంపూర్ నియోజకవర్గం టాస్క్‌ఫోర్స్ టీం సభ్యుడు నాగేశ్వరరావు హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని నాలుగు విత్తన విక్రయ దుకాణాలను టాస్క్ ఫోర్స్ టీం సభ్యులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా టీం సభ్యులు మాట్లాడారు. వర్షాకాలం ప్రారంభానికి ముందే వర్షాలు కురుస్తుండడంతో రైతులు పత్తి, మిరువ, కంది, ఆముదం వంటి విత్తనాలు పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తున్నారన్నారు. దుకాణాల్లో బ్రాండెడ్ విత్తనాలను విక్రయించాలని ఆదేశించారు. విత్తనాలను కొనుగోలు చేసిన రైతులకు దుకాణాల యజమానులు ఒరిజినల్ రశీదులు ఇవ్వాలన్నారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శంకర్‌లాల్, హెడ్ కానిస్టేబుల్ అమర్‌నాథ్, తదితరులు పాల్గొన్నారు.

బిడ్జి నిర్మాణం ఎత్తును పెంచాలి



గట్టు-మల్దకల్ దారిలో తక్కువ ఎత్తులో చేపడుతున్న బిడ్జి నిర్మాణం

గట్టు: భారత్‌మాల రోడ్డు నిర్మాణంలో భాగంగా చేపడుతున్న అండర్‌పాస్ బిడ్జి నిర్మాణాల ఎత్తును పెంచాలని వాహనదారులు, రైతులు కోరుతున్నారు. నందిన్నె నుంచి కర్నూలు వరకు కొత్తగా ఆరు వరుసల జాతీయ రహదారి నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. గట్టు నుంచి మల్దకల్ పంచాయతీ రాజ్ రోడ్డును క్రాస్ చేసే క్రమంలో గంగిమాన్‌దొడ్డి స్టేజీ సమీపంలో బిడ్జి నిర్మాణం పనులు చేపడుతున్నారు. ఇప్పటికే రోడ్డుకు ఇరువైపులా కడ్డీతో నిర్మాణం పూర్తి చేశారు. స్లాబు నిర్మాణంలో భాగంగా ఏర్పాట్లు చేస్తున్నారు. తక్కువ ఎత్తులో స్లాబు వేస్తే, మల్దకల్ నుంచి గట్టుకు వచ్చే భారీ వాహనాలు బిడ్జి కింద దాటుకుని వెళ్లడం కష్టంగా ఉంటుందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. రైతులు పశుగ్రాసం, వ్యవసాయ ఉత్పత్తులను ట్రాక్టర్ల ద్వారా తీసుకొచ్చే క్రమంలో ఇబ్బందులు తప్పవని రైతులు పేర్కొంటున్నారు. ముందుగా బిడ్జి నిర్మాణాన్ని ఎత్తుకు పెంచి స్లాబు వేస్తే ఏ ఇబ్బంది ఉండదని రైతులు, వాహనదారులు చెబుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

హనుమాన్ జయంతికి ఏర్పాట్లు పూర్తి



జూలెకల్ అభయాంజనేయస్వామి ఆలయం

శాంతినగర్: వీర హనుమాన్ జయంతి ఉత్సవాలకు ఆయా గ్రామాల్లోని ఆంజనేయస్వామివారి ఆలయాలు ముస్తాబయ్యాయి. శనివారం నిర్వహించే ప్రత్యేక పూజలకు స్వామివారి ఆలయాలను అర్చకులు శుద్ధిచేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. శాంతినగర్‌లోని పల్లె ఆంజనేయస్వామి వారి ఆలయం, ఆర్డీఎస్ కెనాల్ సమీపంలో వెలసిన శ్రీ అభయాంజనేయ స్వామి వారి ఆలయాల్లో శనివారం ఉదయం 6గంటల నుంచి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, ఆకు పూజలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. సాయంత్రం ఐదు గంటలకు శాంతినగర్‌లోని హనుమాన్ ఆలయం నుంచి రామాలయం వరకు శోభాయాత్ర నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. స్వామివారి కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని హనుమంతుని కృపకు పాత్రులు కావాలని అభయాంజనేయ స్వామి ఆలయ అర్చకులు సాయినాథ్ శర్మ భక్తులను కోరారు.

అయిజ: హనుమాన్ జయంతిని నిర్వహించేందుకు శుక్రవారం మండల కేంద్రంలో, మండలంలోని వివిధ గ్రామాల్లో భక్తులు ఏర్పాట్లు చేసుకున్నారు. హనుమంతుడి జయంతి సందర్భంగా శనివారం భక్తులు ఆంజనేయ స్వామి ఉత్సవ విగ్రహాలను ఘనంగా ఊరేగించనున్నారు. వివిధ ఆలయాల వద్ద తీర్థ ప్రసాదాలతో పాటు భోజన వసతి కల్పించనున్నారు. హనుమంతుడి జయంతి సందర్భంగా అంజనేయస్వామి ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

షీ టీం సేవలు సద్వినియోగం చేసుకోండి



జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్‌లో మాట్లాడుతున్న షీ టీం సభ్యులు

గద్వాల క్రైం: విద్యార్థినులు, మహిళలు షీ టీం సేవలను సద్వినియోగం చేసుకోవాలని షీ టీం సభ్యులు హన్మంతు, దివ్యలు తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్‌లో షీ టీం సభ్యులు అవగాహన సదస్సు ఏర్పాటు చేసి మాట్లాడారు. ఆకతాయిలు ఇబ్బందులకు గురి చేస్తే వెంటనే షీ టీంను సంప్రదించాలన్నారు. మౌనం వీడి ధైర్యంగా ఫిర్యాదు చేయాలన్నారు. బాధితుల వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. రద్దీ ప్రదేశాల్లో మహిళలను మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తూ, ఒంటరిగా వెళ్తున్న సమయంలో వాహనాలపై వెంటపడటం లాంటి చర్యలకు ఎవరైనా పాల్పడుతున్న, అత్యవసర సమయంలో డయల్ 100, 8712670312లకు సంప్రదించాలన్నారు. చిన్నారులతో వెట్టి చాకిరి, పనులు చేయించిన చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు.

నర్సరీలో మొక్కల పెంపకంపై ఆరా..

అలంపూర్ రూరల్: మండలంలోని క్యాతూర్ కోనేర్‌లోని నర్సరీలను, మొక్కల పెంపకాన్ని శుక్రవారం ఎంపీఓ ఖాజామైనొద్దీన్ పరిశీలించారు. వైకుంఠధామం, సెగ్రిగేషన్ షెడ్, పారిశుద్ధ్య పనులు డంపింగ్‌యార్డ్‌లను ఆయన పరిశీలించారు. నర్సరీలలో మొక్కల పెంపకం, నిర్వహణపై సూచనలు, సలహాలు అందజేశారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి దేవకి తదితరులు ఉన్నారు.